# 6. ప్రవక్త ముహమ్మద్(స) జీవితంలోని ఆచరణాత్మకమైన కోణాలు.

**ముస్లిములారా!** ప్రవక్త(స)ను ఏ విషయంలో ఎలా అనుసరించాలి? దీని కోసం మనం ప్రవక్త(స)ను ఆచరణా కోణంలో పరిశీలించాలి, అయితే ఈ ఆచరణా కోణం ఇతర ప్రవక్తల, ధర్మ వ్యవస్థాపకుల జీవిత చరిత్రల్లో కానరాదు. కాని

ముహమ్మద్(స) యొక్క జీవిత రంగాలన్నిటిలో వివరంగా స్పష్టంగా ఉండే రంగం ఇదే, ఈ ఒక్క ప్రామాణికత ద్వారా మనం ప్రవక్తల నాయకుడు, చివరి ప్రవక్త ఎవరు కాగలరని నిర్ణయించగలం, విలువైన బోధనలకు, తియ్యటి పలుకులకు, మంచి విద్యలకు ఈ ప్రపంచంలో కొరత లేదు. కొరత ఉంటే అది ఆచరణలోనే ఉంది. ప్రస్తుతం ఉన్న ధర్మాల వ్యవస్థాపకుల జీవిత చరిత్రలను చదవండి, మనోహరమైన త్థ్యూరీలు దొరుకుతాయి. మనస్సుకు హత్తుకునే సామెతలు, గొప్ప ప్రసంగాలు, భాషాపరమైన సాహిత్యాలు ప్రభావ పూరితమైన ఉపమానాలు తృప్తి పరుస్తాయి. కాని వాటిలో దొరకనిది ఏదైనా ఉంటే అది ఆచరణ మాత్రమే. తాము ఇచ్చే సందేశాలను, ఉపదేశాలను, బోధనలను ఆచరించి చూపాలి. ఇటువంటిదే పరిపూర్ణ వ్యక్తిత్వం.

మానవుని ఆచరణా చరిత్ర పేరే గుణ సంపన్నత, ఖుర్ఆన్ తప్ప ఇతర ఏ ధర్మానికి చెందిన ఏ గ్రంథమూ తన వ్యవస్థాపకుని గుణసంపదకు, అతని ఔన్నత్యానికి ఎటువంటి సాక్ష్యం ఇవ్వలేదు. కాని ఖుర్ఆన్ తన ప్రవక్త గురించి శత్రువుల్లో, మిత్రుల్లో, అన్నిచోట్ల ఈ విధంగా ప్రకటించింది.

وَإِنَّ لَكَ لَأَجْرًا غَيْرَ مَمْنُونٍ وَ إِنَّكَ لَعَلَى خُلُقٍ عَظِيْمٍ . (القلم-٣-٤)

**నిస్సందేహంగా నీ కొరకు అంతం కాని ప్రతిఫలం ఉంది, నిస్సందేహంగా నీవు మహా ఉత్తమ సద్గుణ సంపన్నుడవు.(అల్ఖలమ్-3-4)**

ఈ రెండు వాక్యాల్లో వాదనను,సాక్ష్యాన్నీ పేర్కొనడం జరిగింది, మొదటి వాక్యంలో అంతం కాని ప్రతి ఫలం అని వాదించబడింది. రెండవ వాక్యంలో ఆయన ఆచరణ, సద్గుణాలను సాక్ష్యాలుగా పేర్కొనడం జరిగింది. అంటే ఆయనకు అంతం కాని ప్రతిఫలం ఇవ్వబడింది. కారణం ఆయన ఆచరణ సద్గుణాలు, మక్కా నిరక్షరాశి అయిన అధ్యాపకుడు ఎలుగెత్తి ప్రశ్నిస్తున్నాడు.

لِمَا تَقُولُونَ مَالَا تَفْعَلُونَ . (سورة الصف-٢)

**మీరు చేయని దాని గురించి చెబుతారెందుకు? (సూరతుస్సఫ్-2)**

అది అతని హక్కుగా అంటున్నారు. ఎందుకంటే ఆయన ఏది చెప్పినా అది చేసి చూపిస్తాడు. ప్రవక్త (స), ఈసా(అ) చరిత్రలను సూక్ష్మంగా పరిశీలిస్తే, ఇద్దరిలో చాలా వ్యత్యాసం కనబడుతుంది. ఒకరి జీవితంలో ఈ సద్గుణాల్లో ఏవీ కనబడవు, మరొకరి జీవితంలో ఇవన్నీ పరిపూర్ణంగా ఉన్నాయి. ఆచరణా గుణాలు ఒక వ్యక్తిని పరిపూర్ణ వ్యక్తిగా తయారు చేస్తాయి. దీని గురించి ఖుర్ఆన్ ఇలా సాక్ష్యం ఇస్తుంది.

فَبِمَا رَحْمَةٍ مِنَ اللهِ لِنْتَ لَهُمْ وَلَوْ كُنْتَ فَظًّا غَلِيْظَ القَلْبِ لَانْفَضُّوا مِنْ حَوْلِكَ. (آل عمران -١٥٩)

**దైవానుగ్రహం వల్లనే నీవు సున్నిత స్వభావుడవయ్యావు, ఒకవేళ నీవు కఠిన స్వభావుడవైతే, ప్రజలు నీ దగ్గర నుండి చెదిరిపోతారు.(ఆలిఇమ్రాన్-159)**

ఇక్కడ ప్రవక్త(స) సున్నిత మనస్తత్వాన్ని గురించి ప్రస్తావించబడింది. దీన్ని వాదనలు, ఆధారాలతో పాటు ఖుర్ఆన్ లో పేర్కొనడం జరిగింది. ఖుర్ఆన్ లో మరో చోట ఇలా పేర్కొనడం జరిగింది,

لَقَدْ جَاءَكُمْ رَسُولٌ مِنْ اَنْفُسِكُمْ عَزِيْزٌ عَلَيْهِ مَا عَنِتُّمْ حَرِيْصٌ عَلَيكُمْ بِالْمُؤْمِنِينَ رَءُوفٌ رَّحِيْمٌ.(التوبة-١٢٨)

**మీ వద్దకు మీలో నుండే ఒక ప్రవక్త వచ్చాడు, మీరు నష్టానికి గురికావటం ఆయనకు ఎంతమాత్రం ఇష్టంలేదు, ఆయన మీ సాఫల్యాన్నే కోరుకుంటున్నాడు.(అత్తౌబహ్-128)**

ఈ వాక్యంలో అల్లాహ్(త) ప్రవక్త(స) యొక్క మనోభావాలను పేర్కొన్నాడు. ఇవన్నీ మానవుని సహజగుణాలు. అందువల్లే ప్రజలారా! మీరు బాధలకు కష్టాలకు గురికావటం, సత్యాన్ని తిరస్కరించటం, అజ్ఞానాన్నీ, పాపకార్యాల్ని పట్టుకొని ప్రేలాడటం ప్రవక్తకు చాలా బాధ కలిగిస్తుంది. ఆయన మీ మంచినే కోరుతున్నాడు. మానవుల పట్ల శ్రేయోభిలాష మీకు సందేశం, ప్రచారం, బోధనలకు వత్తిడి చేస్తుంది. ఆయన సందేశాన్ని స్వీకరించిన వారి పట్ల ఆయన ఎంతో ఉదారంగా వ్యవహరిస్తాడు. ఈ వాక్యంలో ముహమ్మద్(స) మానవులందరి శ్రేయోభిలాషని, మంచిని కోరేవారని, ప్రత్యేకంగా ముస్లింలపై చాలా దయాళువు అని సాక్ష్యం ఇవ్వబడింది. ఇవన్నీ ఆయన నైతిక ఆచరణకు ఆకాశ సాక్ష్యాధారాలు.

ఇస్లామీయ ఆదేశాలు, ప్రవక్త(స) ద్వారా ఇవ్వబడిన బోధనల మిశ్రమమే ఈ ఖుర్ఆన్. ఆచరణా పరంగా ప్రవక్త(స) జీవిత చరిత్ర ఖుర్ఆన్ కు వ్యాఖ్యానం వంటిది. ఆయనపై అవతరించిన ప్రతి ఆదేశాన్ని ఆయన ఆచరించి చూపారు. విశ్వాసం, ఏకత్వం, నమాజ్, ఉపవాసం, హజ్, జకాత్, దానధర్మాలు, జిహాద్, ఇతరులను ప్రాధాన్యత ఇవ్వడం, త్యాగం, దృఢ నిశ్చయం, నిలకడ, సహనం, కృతజ్ఞత, ఇవేకాక ఇంకా ఎన్నో నేర్పిన విషయాలను ముందు తాను ఆచరించి చూపారు. ప్రవక్త(స) ఖుర్ఆన్ లో ఉన్నదంతా ముందు తాను ఆచరించి చూపారు. కొందరు అనుచరులు ఆయిషహ్(ర) వద్దకు వెళ్ళి ప్రవక్త(స) సద్గుణాల గురించి, దినచర్యల గురించి తెలుపమని కోరారు. సమాధానంగా ఆమె "మీరు ఖుర్ఆన్ చదవలేదా?" అని ప్రశ్నించి, "ఆయన సద్గుణాలు ఖుఆన్" అని అన్నారు. (అబూదావూద్) ఖుర్ఆన్ పదాల్లో వాక్యాల్లో ఉన్నాయి. ముహమ్మద్(స) జీవిత చరిత్ర దాని వివరణ, వ్యాఖ్యానమూను.

ఒక వ్యక్తి సద్గుణాలను గురించి, అలవాట్లను గురించి, దిన చర్యలను గురించి అతడి భార్య కంటె ఎక్కువగా ఇతరులెవ్వరికీ తెలిసి ఉండదు. ప్రవక్త(స) తాను దైవప్రవక్తనని ప్రకటించినప్పటికి ఖదీజాతో పెళ్ళయి 15సంవత్సరాలు

https://teluguislam.net

అయిపోయింది. ఇది ఎంత పెద్ద కాలం అంటే ఒక వ్యక్తి గురించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చు. ఈ వివరాల ప్రభావం ఏం చేసిందో తెలుసా? ఇటు ప్రవక్త(స) నేను దైవ్రవక్తనని ప్రకటించారు. అటు ఖదీజా హృదయం ధృవీకరించింది. ప్రవక్త(స) దైవదౌత్య భారం వల్ల ఆందోళనకు గురైతే ఖదీజా "ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ మిమ్మల్ని ఒంటరిగా వదలడు, ఎందుకంటే తమరు బంధువుల హక్కులను నెరవేర్చుతారు, సత్యాన్ని సమర్థిస్తారు, కష్టాల్లో ప్రజలకు సహాయం చేస్తారు" అని ఓదార్చేవారు.(బుఖారీ) ఆలోచించండి! దైవదౌత్యానికి ముందు ఆయనలో ఉండే క్రియాత్మక గుణాలు ఇవి.

ప్రవక్త(స) భార్యలందరిలో ఖదీజా తర్వాత ప్రవక్త(స)కు అందరికంటే ప్రియమైనది ఆయిషహ్(ర). ఆయిషహ్(ర) 9సంవత్సరాల వరకు ప్రవక్త(స)కు తోడుగా ఉన్నారు, స్వయంగా ఆమె "ప్రవక్త(స) ఎవరినీ చీవాట్లు పెట్టేవారు కారని, చెడుకు బదులు చెడు చేసేవారు కారని, పైగా క్షమించేవారని, ఎల్లప్పుడూ పాపాలకు దూరంగా ఉండేవారని, ఏనాడూ ఎవరితోనూ ప్రతీకారం తీర్చు కోలేదని, ఆయన ఎవరినీ, సేవకుడ్నిగాని, సేవకురాలినిగాని, చివరికి జంతువునైనా ఏనాడూ కొట్టలేదని, అంతేకాదు, ఎవరి ధర్మసమ్మతమైన విన్నపాన్నైనా సరే ఏనాడూ తిరస్కరించలేదని" సాక్ష్యం ఇస్తున్నారు.

బంధువుల్లో ప్రవక్త(స) గురించి అలీకి బాగా తెలిసి ఉండేది. బాల్యం నుండి యవ్వనం వరకు ఆయన సేవలో ఉన్నారు. ఆయన ఇలా సాక్ష్యం ఇస్తున్నారు, "ఆయన ముఖంపై చిరునవ్వు ఉండేది. సున్నిత మనస్తత్వం, మంచిగుణాలు కలిగి ఉండేవారు. దయామయులు, కఠోర మనస్కులు కారు, నోటి ద్వారా చెడు పలికేవారు కారు. ప్రజల లోపాలను బలహీనతలను వెదికేవారు కారు. ఎవరైనా ఏదైనా తన మనస్తత్వానికి వ్యతిరేకంగా అంటే మౌనం వహించేవారు. సూటిగా సమధానం ఇచ్చి నిరాశకు గురిచేయరు. ఎవరి హృదయాన్నీ కష్టపెట్టేవారు కారు.

https://teluguislam.net

బాధకు గురిచేసేవారు కారు, ఎందుకంటే ఆయన కరుణామయులు, దయాశీలురు".

ఇంకా అలీ(ర) ఇలా అంటున్నారు, "ప్రవక్త(స) విశాల హృదయులు, సూటిగా మాట్లాడేవారు, సున్నిత మనస్కులు, ప్రజలు ఆయన వద్ద కూర్చుంటే సంతోషించేవారు, ప్రవక్త(స)ను మొదటిసారి చూచిన వ్యక్తి భయానికి గురౌతాడు, కాని తరువాత మాటామంచీ పెరిగిన కొద్దీ ఆయన్ను ప్రేమించడం ప్రారంభిస్తాడు". (షమాయిల్ తిర్మిజి)

ప్రవక్త(స) జీవిత చరిత్ర చదివి సరిగ్గా ఇటువంటి అభిప్రాయమే ప్రఖ్యాత చరిత్రకారుడు వెలుబుచ్చాడు. ఆయన సవతి కొడుకు హిన్ద్ ప్రవక్త పరిరక్షణలో ఉండేవాడు. ప్రవక్త(స) గురించి "ఆయన సున్నిత స్వభావం గలవారని, కఠోర మనస్కులు కారని, ఎవరి మనస్సును నొప్పించేవారు కారని, ఎవరినీ అగౌరవ పరిచేవారు కారని, భోజనం ఎలాంటిదైనా తినేవారని, లోపాలు ఎంచేవారు కారని, ఆయనకు తన వ్యక్తిగత కార్యాల్లో ఎంతమాత్రం కోపం వచ్చేది కాదని, ప్రతీకారం తీర్చుకునేవారు కారని, ఒకవేళ ఎవరైనా సత్యాన్ని వ్యతిరేకిస్తే కోపం వచ్చేదని సాక్ష్యం ఇచ్చారు".

ఆయనకు చాలా దగ్గరగా ఉండే, ఆయన గురించి బాగా తెలిసినవారి సాక్ష్యాలు. దీనివల్ల ఆయన జీవిత చరిత్రలోని ఆచరణా స్థానం ఎటువంటిదో తెలిసిపోతుంది. ఆయన తన అనుచరులకు బోధించిన దానిని అందరికంటే ముందు తాను స్వయంగా ఆచరించి చూపారు.

ప్రవక్త(స) ప్రజలకు దేవున్ని గుర్తుచేయాలని, ప్రేమించాలని హితబోధ చేసారు. ఈ బోధనలవల్ల అనుచరుల జీవితంలో చాలా మార్పు వచ్చింది. స్వయంగా ప్రవక్త(స) జీవితం దానికి అనుగుణంగా ఉండేదని ఆలోచిస్తే ప్రవక్త(స) ఎల్లప్పుడూ దైవాన్ని ప్రార్థించేవారు, గుర్తు చేసుకునే వారు, తింటూ త్రాగుతూ,

కూర్చుంటూ లేస్తూ, అన్నివేళలా, ఎల్లప్పుడూ, అల్లాహ్ ను స్తుతించే వారు, కీర్తించేవారు. ఈనాడు చాలా గ్రంధాలు వీటి గురించే ఉన్నాయి. వివిధ కాలాల్లో, వివిధ సందర్భాల్లో పఠించే అనేక దుఆలు ఉన్నాయి. హిస్నె హసీన్ అనే పుస్తకం ఈ దుఆలతోనే కూడుకొని ఉంది. ప్రతి దుఆలో దేవుని ప్రేమ, గొప్పతనం, ఠీవి, ఆధిక్యత, దైవభీతి ఉట్టిపడుతూ ఉంటాయి. ప్రవక్త(స) నోటిపై ఎల్లప్పుడూ దేవుని గొప్పతనమే ఉండేది. ఖుర్ఆన్ లో అల్లాహ్(త) తనను ప్రార్థించే వారిని ఇలా ప్రశంసించడం జరిగింది.

الَّذِينَ يَذْكُرُونَ اللهَ قِيمًا وَ قُعُودًا وَ عَلٰى جُنُوبِهِمْ .(آل عمران-١٩١)

**నిల్చున్నా కూర్చున్నా ఇంకా ప్రక్కలపై ఎల్లప్పుడూ అల్లాహ్ ను ప్రార్థిస్తూ ఉంటారు.(ఆలిఇమ్రాన్-191)**

ఇదే ప్రవక్త(స) జీవితం. ప్రవక్త(స) ఎల్లప్పుడూ దైవధ్యానంలో నిమగ్నమయి ఉండేవారని ఆయిషహ్ (ర) సాక్ష్యం ఇస్తున్నారు. ప్రవక్త(స) ప్రజలకు నమాజు గురించి ఆదేశించేవారు, ఈ విషయంలో ఆయన పరిస్థితి ఎలా ఉండేదో తెలుసా? ఆయన 8 వేళల నమాజు అంటే 5 పూటలు, సూర్యోదయం తరువాత, ఇష్రాఖ్, మరికొంత పొద్దెక్కిన తర్వాత చాష్త్, రాత్రి తహజ్జుద్ చదివేవారు. ముస్లింలపై రోజుకు 17 రకాతులు విధిగా చేయబడ్డాయి. కాని ప్రవక్త(స) 50 లేక 60 రకాతులు చదివేవారు. 5పూటలు నమాజులు విధించబడిన తర్వాత ముస్లింలకు తహజ్జుద్ నమాజు రద్దు చేయబడింది. కాని ప్రవక్త(స) జీవితాంతం తహజ్జుద్ నమాజులు ఆచరించేవారు. అంతేకాదు రాత్రంతా నమాజులో నిలబడేవారు. దానివల్ల ఆయన కాళ్ళు వాచిపోయేవి. ఆయిషహ్(ర) ప్రవక్త(స)తో "అల్లాహ్(త) మిమ్మల్ని పూర్తిగా క్షమించి వేసాడు, అయినా తమరు ఈ విధంగా కష్టపడుతున్నారని" అడగ్గా, "ఓ ఆయిషహ్! నేను దేవుని కృతజ్ఞుడైన దాసునిగా కాకూడదా?" అంటే అది దైవప్రేమ

https://teluguislam.net

వల్ల అని తెలిపారు. రుకూ ఎంత దీర్ఘంగా చేసేవారంటే, చూచేవారు ప్రవక్త(స) సజ్దా చేయడం మరచిపోయారు అని అనుకునేవారు.

దైవదౌత్య ప్రారంభం నుండే ప్రవక్త(స) నమాజు చదివేవారు. అవిశ్వాసులు ఆయనకు బద్ధ శత్రువులైనా, హరమ్ లోనికి వెళ్ళి నమాజు చేసేవారు. అనేకసార్లు ప్రవక్త(స) నమాజు స్థితిలో ఉండగా శత్రువులు దాడి చేసారు. అయినా మానలేదు. శాంతిభద్రతల్లోనూ, కష్టసమయాల్లోనూ, యుద్ధ సమయాల్లోనూ నమాజు వదిలేవారు కారు. ఖందఖ్ యుద్ధం సందర్భంగా రాత్రంతా నడిచి అందరూ పడుకున్నారు. ఈ రెండు సందర్భాల్లోనే నమాజు తప్పింది. కాని వెంటనే ఆచరించారు. మరణానికి ముందు విషజ్వరంతో ఉన్నారు, చాలా బాధగా ఉండేది. అయినప్పటికీ ఇద్దరు అనుచరుల సహాయంతో మస్జిద్ లోనికి వచ్చారు. మరణానికి మూడు రోజులు ముందు లేవటానికి ప్రయత్నించారు, కాని వెంటనే స్పృహతప్పి పడిపోయారు. ఇలా మూడుసార్లు జరిగింది. అప్పుడు కూడా సామూహిక నమాజు తప్పింది. ప్రవక్త(స) యొక్క దైవారాధనలో ఆచరణా ఆదర్శం ఇలా ఉండేది.

ప్రవక్త(స) ఉపవాసాల గురించి ఆదేశించారు. ముస్లిములపై రమజాన్ మాస ఉపవాసాలు విధించ బడ్డాయి. మరి ప్రవక్త(స) పరిస్థితి ఎలా ఉండేదో గమనిద్దాం, ప్రతివారం, ప్రతి నెల ఉపవాసాలు పాటించేవారు. ప్రవక్త(స) ఉపవాసాలు ప్రారంభిస్తే ఇక వరుసగా ఉపవాసాలు ఉంటారేమో అని అనిపించేది. ఉంటే ఏదైనా తినేవారు, లేదా ఉపవాసం ఉండేవారు. అనుచరులు ఆయన్ను అనుసరించదలిస్తే, నాలా మీలో ఎవరున్నారు, నాకు నా ప్రభువు తినిపిస్తాడు, త్రాపిస్తాడు అనేవారు. సంవత్సరంలో రెండు నెలలు షాబాన్, రమజాన్ ఉపవాసాల్లో గడిచేవి. ప్రతినెలలో 13,14, 15 తేదీలు, ముహర్రమ్ 10 రోజులు, షవ్వాల్ 6 రోజులు, వారానికి 2 రోజులు సోమవారం, గురువారం ఉపవాసం ఉండేవారు. ఉపవాసాల విషయంలో ప్రవక్త(స) ఆచరణా చిత్రం ఇది.

ప్రవక్త(స) జకాత్ దానధర్మాల గురించి ఆదేశించారు. ముందు తాను ఆచరించి చూపారు. ఖదీజా సాక్ష్యం మీరు వినే ఉన్నారు. ఆమె ఇలా అన్నారు, “ఓ అల్లాహ్ ప్రవక్తా! తమరు రుణగ్రస్తుల రుణాన్ని చెల్లిస్తారు, పేదవారికి, కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేస్తారు”. ప్రవక్త(స) ప్రజలకు మీరు అన్నీ వదలి నా వెంట రండని చెప్పలేదు. కేవలం మీ సంపాదనలో కొంత దైవమార్గంలో ఖర్చు చేయండని మాత్రమే హితబోధ చేసారు. తాను స్వయంగా వచ్చినదంతా దైవమార్గంలో ఖర్చు చేసేవారు. యుద్ధాలవల్ల, విజయాలవల్ల ధనానికి లోటు ఉండేదికాదు. అంతా ప్రజల కొరకు ఉండేది. తన కోసం ఏదీ ఉండేదికాదు. తన ఇంట్లో ఆకలి దప్పులు ఉండేవి. ఖైబర్ విజయం 7వ హిజ్రీ తర్వాత ప్రవక్త(స) భార్యలందరికీ సంవత్సరానికి కావలసిన ధాన్యం పంచడం జరిగేది. కాని సంవత్సరం పూర్తి కాకుండానే ధాన్యం అయిపోయేవి. పస్తులు ప్రారంభం అయ్యేవి. ధాన్యంలోని అధిక భాగాన్ని పేదలకు పంచి పెట్టడం జరిగేది. ఇబ్నె అబ్బాస్(ర) ప్రకారం ప్రవక్త(స) అందరికంటే అధికంగా దానగుణం కలిగి ఉండేవారు. రమజాన్ లో అధికంగా దానం చేసేవారు. జీవితంలో ఏనాడూ లేదు, కాదు అని అనలేదు. ఏ వస్తువునూ ఒంటరిగా తినేవారు కారు. తినే వస్తువు ఎంత తక్కువగా ఉన్నా ఇతరులను కలుపు కునేవారు. ప్రజల్లో ఎవరైనా రుణం ఇవ్వకుండా చనిపోతే నాకు తెలియపరచాలని, నేను అతని రుణం చెల్లిస్తానని, ఒకవేళ అతడు ఆస్తి వదలి ఉంటే అతని వారసులకు చెందుతుందని ప్రజలకు ఆదేశించేవారు. ఒకసారి ఒక వ్యక్తి వచ్చి, “ఓ ముహమ్మద్! ఈ సరుకు నీది కాదు, నీ తండ్రిది కాదు, దాన్ని నా ఒంటెపై ఎక్కించు” అని అన్నాడు. ఆ సరుకును ప్రవక్త(స) అతని ఒంటెపై ఎక్కించారు. అతడి మాటలకు ఏమాత్రం అపార్థం చేసుకోలేదు. ఇంకా నేను కేవలం పంచేవాడిని, ధనాధికారి, ఇచ్చేవాడు ఆ దేవుడే అని అనేవారు. అబూజర్ ఇలా అంటున్నారు, “ఒకసారి నేను ప్రవక్క(స)తో పాటు ఒక మార్గంలో పోతున్నాం. అప్పుడు ప్రవక్త(స) నాతో నావద్ద ఉహుద్

https://teluguislam.net

కొండంత బంగారం ఉన్నా అందులో నుండి ఒక్క దీనార్ కూడా నావద్ద ఉండడం ఇష్టంలేదు" అని అన్నారు.

**మిత్రులారా!** ఇవి ప్రవక్త(స) మనోహరమైన పదాలు కావు, ఇవి ఆయన దృఢ సంకల్పానికి, ప్రవర్తనకు ప్రతీక, ఆయన ఆచరణ కూడా ఇలాగే ఉండేది. ఒకసారి బహ్రైన్ నుండి నిధి వచ్చింది, మస్జిద్ ప్రాంగణంలో వేయబడింది, ఫజ్ర్ నమాజు కొరకు ప్రవక్త(స) వచ్చారు. అక్కడ చూచినవారు ఇలా అంటున్నారు, ఆయన ఆ నిధివైపు కన్నెత్తి కూడా చూడలేదు, నమాజు తర్వాత ఆ నిధివద్ద కూర్చొని, పంచటం ప్రారంభించారు. అంతా అయిపోయిన తర్వాత మట్టి అంటుకున్నట్టు బట్టలు దులుపుకొని నిలబడ్డారు.

ఒకసారి ఫదక్ నుండి నాలుగు ఒంటెలపై ఆహార ధాన్యాలు వచ్చాయి. కొంత అప్పుగా ఇవ్వడం జరిగింది. కొంత ప్రజలకు ఇవ్వబడింది. ప్రవక్త(స) ఏమైనా మిగిలిందా అని బిలాల్ ను అడిగారు. ఇప్పుడు ఇంకా తీసుకోవలసిన వారు ఇంకెవరూ లేరు, అందువల్ల కొంత మిగిలింది అని బిలాల్ అన్నారు. అప్పుడు ప్రవక్త(స), ఈ ప్రాపంచిక సంపద ఉన్నంత వరకు నేను ఇంటికి వెళ్ళను అని పలికి, రాత్రి మస్జిద్ లో గడిపారు. ఉదయం బిలాల్ వచ్చి, "ఓ అల్లాహ్ ప్రవక్తా! అల్లాహ్ మిమ్మల్ని ఈ భారం నుండి తప్పించాడు, అంటే ఉన్నదంతా పంచబడింది" అని అన్నారు. ప్రవక్త(స) దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఒకసారి అస్ర్ తర్వాత అలవాటుకు వ్యతిరేకంగా ఇంట్లోనికి వెళ్ళి వెంటనే బయటకు వచ్చారు. ప్రజలకు ఆశ్చర్యం కలిగింది, అప్పుడు నా దగ్గర బంగారు ఉంగరం ఉన్నట్టు నాకు నమాజులో గుర్తుకు వచ్చింది, అది నా దగ్గర ఉండగా రాత్రి గడవటం కూడా నాకు ఇష్టం లేదు అని అన్నారు. ఉమ్మె సల్మా ఇలా అంటున్నారు, "ఒకసారి ప్రవక్త(స) విచారంగా లోపలికి వచ్చారు, కారణం అడిగాను. దానికి ఆయన ఉమ్మెసల్మా! నిన్న ఆ 7 దీనార్లు వచ్చాయి, సాయంత్రం అయిపోయింది, అవి అలాగే ఉండటం నాకు ఇష్టంలేదు" అని అన్నారు. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం, ప్రవక్త(స)

https://teluguislam.net

మరణావస్థలో ఉన్నారు, జ్వరం చాలా తీవ్రంగా ఉంది, మనస్సు ఆందోళనకరంగా ఉంది. అప్పుడే ఆయనకు ఇంట్లో కొన్ని అష్రఫీలు ఉన్నాయని గుర్తుకు వస్తుంది. వెంటనే వాటిని దానం చేయండని ఆదేశిస్తారు, ముహమ్మద్ ఇంట్లో అష్రఫీలు ఉండగా ఆయన తన దైవాన్ని కలవటం మంచిది కాదు అని అన్నారు. ఇవి ఈ అధ్యాయంలో గల ప్రవక్త(స) ఆచరణా పధానికి చెందిన ఉదాహరణలు.

ప్రవక్త(స) నిరాడంబరత, తృప్తిని గురించి ఉపదేశించారు. అయితే ఈ విషయంలో ఆయన ఆచరణ ఎలా ఉండేదో చూడండి, అన్నీ వైపుల నుండి టాక్స్, పరిహార రుసుము, జకాత్, దానధర్మాల నిధులు వచ్చేవి. కాని మహాప్రవక్త ఇంట్లో అవే పస్తులు, అదే బీదరికం ఉండేవి. ప్రవక్త(స) మరణం తరువాత ఆయిషహ్(ర) ఇలా అనేవారు, ప్రవక్త(స) మరణించారు కాని ఏనాడూ రెండు పూటలు కూడా ఆయన కడుపు నిండా అన్నం తినలేదు. ఆమె మరో ఉల్లేఖనలో ఇలా ఉంది, ప్రవక్త(స) మరణించినపుడు ఇంట్లో ఆ రోజు కొన్ని జొన్నలు మాత్రమే ఉన్నాయి. కొన్ని సేర్ల జొన్నలకు బదులుగా ప్రవక్త(స) యుద్ధ కవచం ఒక యూదుని వద్ద తాకట్టుగా ఉండేది. ప్రవక్త(స) “ఆదమ్ కుమారునికి ఈ కొన్ని వస్తువులు తప్ప మరిదేని హక్కు లేదు. అవి ఉండటానికి ఒక పూరి గుడిసె, శరీరం కప్పటానికి బట్ట, కడుపు నింపటానికి ఎండురొట్టె, నీరు” అని అన్నారు. (తిర్మిజి)

ఇవి కేవలం మనోహరమైన పలుకులు, పదాలు కావు. ఇదే ఆయన వాస్తవ జీవిత చిత్రం. ఉండటానికి ఇల్లు, ఒక చిన్నగది, అందులో మట్టి గోడలు, ఖర్జూరం ఆకులు, ఒంటె వెంట్రుకలతో పైకప్పు. ఆయిషహ్(ర) ఆయన బట్టలు ఏనాడూ మడతబెట్టి ఉంచడం జరగలేదు. అంటే ఒంటి మీద ఉన్న బట్ట తప్ప మరే బట్టలు ఉండేవికావు. ఒకసారి ఒక బిచ్చగాడు ప్రవక్త(స) వద్దకు వచ్చి, “నేను చాలా ఆకలిగా ఉన్నాను” అని అన్నాడు. ఏమైనా ఉంటే తినడానికి పంపమని తన భార్యల వద్దకు కబురు పంపారు. అందరి దగ్గర నుండి ఇంట్లో నీరు తప్ప మరేమీ లేదు అనే వార్తలు వచ్చాయి. అబూతల్హా ఇలా అంటున్నారు, “ఒకసారి

https://teluguislam.net

ప్రవక్త(స)ను చూసాను, మస్జిద్ లో మేనువాల్చి ఉన్నారు. ఆకలి బాధ వల్ల ప్రక్కలు తిరుగుతూ ఉన్నారు''. ఒకసారి అనుచరులు తాము పస్తులుండటాన్ని గురించి విన్నవించుకున్నారు. బట్టలు ఎత్తి కడుపు చూపించారు. వారి కడుపులకు రాళ్ళు కట్టి ఉన్నాయి. ప్రవక్త(స) తన కడుపును చూపించారు. రెండు రాళ్ళు కట్టి ఉన్నాయి. అంటే రెండు రోజుల నుండి పస్తులున్నారు. అనేకసార్లు ఆకలి వల్ల వచ్చే శబ్దం బయడపడేది. స్పృహ కోల్పోయే వారు. ఒకరోజు ఇంటి నుండి ఆకలితో బయలుదేరారు. అబూ అయ్యూబ్ అన్సారీ ఇంటికి వెళ్ళారు, ఆయన తోట నుండి ఖర్జూరం పళ్ళు తెచ్చి ఉన్నారు. తినటానికి భోజనం ఏర్పాటు చేసారు. భోజనం ముందుకు వచ్చింది. ప్రవక్త(స) ఒక రొట్టెపై కొంత మాంసం కూర పెట్టి దీన్ని ఫాతిమాకు పంపించి, ''చాలా రోజులయింది, ఆమెకు భోజనభాగ్యం కలగలేదు'' అని అన్నారు.

ప్రవక్త(స) తన కుమార్తెను, హసన్ హుసైన్ లను చాలా గాఢంగా ప్రేమించేవారు. కాని ఈ ప్రేమను అరబ్ నాయకుల్లా విలువైన దుస్తుల ద్వారా, బంగారం, వెండి నగల ద్వారా వ్యక్తపరచలేదు. ఒకసారి అలీ(ర) ఇచ్చిన బంగారు హారాన్ని ఫాతిమా మెడలో చూచిన ప్రవక్త(స) ఇలా అన్నారు, ''ఫాతిమా! ముహమ్మద్ కూతురి మెడలో అగ్నికంకణం వేసుకొని ఉంది అని ప్రజలు నిన్ను అనాలని కోరుతున్నావా?'' అని అన్నారు. వెంటనే ఫాతిమా ఆ బంగారు హారాన్ని తీసి అమ్మి వేసారు. ఆ వచ్చిన ధనంతో ఒక బానిసను కొని విడుదల చేసారు. ఒకసారి ఆయిషహ్(ర) బంగారు కంకణాన్ని ధరిస్తే, తీయించి ముహమ్మద్ భార్యకు ఇది తగదు అని అన్నారు. అంతేకాదు ప్రవక్త(స) మానవునికి ఈ ప్రపంచంలో ఒక ప్రయాణీకునికి కావలసినంత ప్రయాణ ఆహారం చాలు అని అనేవారు. ఇవి ఆయన మాటలు, ఇవే ఆయన చేతలు కూడా. ఒకసారి కొంతమంది అభిమానులు కలవడానికి వచ్చారు. ప్రవక్త(స) ప్రక్కల్లో చాప గుర్తులు చూసారు, ''ఓ ప్రవక్తా! మేము ఒక మెత్తని పరుపు తయారుచేసి మీకు కానుకగా ఇద్దాం

అనుకుంటున్నాము" అని విన్నవించుకున్నారు. అప్పుడు ప్రవక్త (స) "నాకు ఈ ప్రపంచంతో పనేమిటి? ఒక ప్రయాణీకుడు ప్రయాణంలో కొంతసేపు నీడలో విశ్రాంతి తీసుకున్నట్టే నాకు ఈ ప్రపంచంతో సంబంధం ఉంది" అని అన్నారు. 9వ హిజ్రీలో ఇస్లామ్ సామ్రాజ్యం యమన్ నుండి సిరియా వరకు వ్యాపించి ఉండేది. కాని ఆయన (స)వద్ద శరీరం పై ఒక పైజామా , తాళ్ళతో అల్లిన ఒక మంచం, ఒక చెట్టును వలచి తయారు చేసిన తలగడ, ఒక ప్రక్క కొన్ని జొన్నలు, ఒక మూల జంతువు చర్మం, ఉట్టిలో నీటి కుండలు ఇవే ఆ నోటి మాటలకు అద్దం పట్టు చేతలు.

**మిత్రులారా!** ఇతరులకు ప్రాధాన్యత నిచ్చే విషయం గురించి గొప్పగొప్ప ప్రసంగాలు వింటూ ఉంటాం. కాని ఇటువంటి బోధకుల జీవిత చరిత్రలో దీని ఉదాహరణలు కనిపిస్తాయా? ఆదర్శంకావాలంటే మదీనా వీధుల్లో దొరుకు తుంది. ప్రవక్త(స) ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వటాన్ని గురించి ఉపదేశించారు. దానికి తోడు ఆచరించి చూపారు. ప్రవక్త(స) ఫాతిమాను ఎంతగా ప్రేమించేవారో అది అందరికీ తెలుసు కాని, ఫాతిమా పిండిమర త్రిప్పుతూ చేతులు వాచిపోయాయి, నీళ్ళు తోడుతూ గుండె నొప్పికి గురయ్యారు. ఒకసారి ఆమె ప్రవక్త(స) వద్దకు వచ్చి ఒక సేవకురాలిని ఇవ్వమని విన్నవించుకున్నారు. అప్పుడు ప్రవక్త(స) "ఫాతిమా! ఇప్పటి వరకు సుఫ్ఫా వాళ్ళకే ఏర్పాటు అవలేదు, నీ దరఖాస్తు ఎలా స్వీకరించగలను?" మరో ఉల్లేఖనలో "ఫాతిమా! బద్ర్ అనాధలు నీ కంటే ముందు దరఖాస్తు ఇచ్చి ఉన్నారు" అని అన్నారు. ఒకసారి ప్రవక్త(స) దుప్పటి లేదు, ఒక స్త్రీ దుప్పటి తెచ్చి ఇచ్చారు. అదే సమయంలో ఒక వ్యక్తి ఈ దుప్పటి ఎంత బాగుంది అని అన్నాడు. ప్రవక్త(స) వెంటనే ఆ దుప్పటి తీసి అతనికి ఇచ్చి వేసారు.

ఒక అనుచరుడి ఇంట్లో శుభకార్యం జరగనున్నది, కాని ఆయన వద్ద ఏమీ లేదు. అప్పుడు ప్రవక్త(స) ఆయనతో ఆయిషహ్ వద్దకు వెళ్ళి "పిండి బుట్ట తీసుకురా" అన్నారు. ఆవ్యక్తి వెళ్ళి తీసుకొని వచ్చారు. కాని ప్రవక్త(స) ఇంట్లో రాత్రి తినటానికి ఆ పిండి తప్ప మరేమీ లేదు. ఒకసారి సుఫ్ఫా పేదలను తీసుకొని

https://teluguislam.net

ఆయిషహ్(ర) ఇంటికి వచ్చారు. "తినడానికి ఏదైనా ఉంటే ఇవ్వండి" అన్నారు, నూకల అన్నం ముందుంచబడింది. అది చాలలేదు, "ఇంకేమైనా ఉందా" అని అడిగారు, ఎండు ఖర్జూరం పాయసం ఇవ్వబడింది. ఆ తరువాత పాలు వచ్చాయి, ఉన్న వీటినే అతిథులకు ఇవ్వడం జరిగింది. ఇదీ ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వటం, దాని ఆచరణ.

అల్లాహ్ పై నమ్మకానికి ప్రత్యక్ష ఉపమానం చూడాలని ఉంటే ముహమ్మద్(స)ను చూడండి, అల్లాహ్ ఆదేశం," **ఆత్మస్థైర్యం గల ప్రవక్తలు సహనం, నిలకడ పాటించినట్లు నీవూ సహనం పాటించు.**" ప్రవక్త (స) అలాగే చేసి చూపించారు. తమ నమ్మకాలకు వ్యతిరేకంగా ఒక్క పదం కూడా వినజాలని జాతిలో ప్రవక్త(స) జన్మించారు. అంతేకాదు ఈ జాతివారు ప్రతి చిన్న విషయంపై చంపడానికి, చావడానికి సిద్ధపడేవారు. కాని ప్రవక్త(స) ఏమాత్రం భయ పడకుండా హరమ్ లోనికి వెళ్ళి ఏకత్వ సందేశాన్ని ఎలుగెత్తి చాటేవారు. అంతేకాదు అక్కడ అందరి ముందు నమాజు ఆచరించేవారు. హరమ్ లో ఖురైష్ నాయకులు వచ్చి కూర్చునేవారు. ప్రవక్త(స) వారి ముందు నిలబడి రుకూలు, సజ్దాలు చేసేవారు. "ఓ ముహమ్మద్! నిన్ను ఆదేశించినదాన్ని ప్రకటించు" అనే వాక్యం అవతరించినపుడు ప్రవక్త(స) సఫా కొండపై నిలబడి ఖురైష్ ప్రజలందరినీ ఎలుగెత్తి పిలిచి దైవసందేశాన్ని అందజేసారు.

ఖురైష్ ప్రజలు ప్రవక్త(స)ను అనేక విధాలుగా హింసించారు. శరీరంపై మాలిన్యాన్ని వేసేవారు. మెడలో దుప్పట్లు వేసి లాగేవారు. మార్గంలో ముళ్ళు పరిచేవారు. కాని ప్రవక్త(స) ముందడుగు చెక్కు చెదర లేదు. అబూతాలిబ్ తన సమర్థాన్ని వాపసు తీసుకున్నప్పుడు ఆవేశం మరియు ఉత్సాహంతో "చిన్నాన్నగారూ! ఒకవేళ ఖురైష్ నా కుడిచేతిలో సూర్యున్ని, ఎడమ చేతిలో చంద్రున్ని పెట్టినా నేను ఈ విధి నిర్వహణ నుండి వెనుతిరగనని" సమాధానం ఇచ్చారు. చివరకు ప్రవక్త(స), బనూ హాషిమ్ షేబ అబీ తాలీబ్ లోయలో 3

సంవత్సరాల వరకు సాంఘిక బహిష్కరణకు గురవయ్యారు. ఖురైషులు ప్రవక్త(స), ఆయన కుటుంబం వారితో సంబంధాలను త్రెంచుకున్నారు. ఆహార ధాన్యాలు లోపలికి రాకుండా అవరోధం కల్పించారు. పిల్లలు ఆకలితో అలమటించేవారు. యువకులు ఆకులు తిని జీవితం గడిపేవారు, చివరికి ప్రవక్త(స) హత్యకు కుట్ర పన్నారు. ఇన్ని జరిగినా ప్రవక్త(స) సహనాన్ని, నిలకడను, ఏకాగ్రతను వదల్లేదు. వలస పోయినపుడు సౌర్ గుహలో దాక్కున్నారు, అవిశ్వాసులు వెంబడించారు, గుహద్వారం వరకు చేరుకున్నారు. వారికి వీరికీ కొన్ని గజాల దూరం మాత్రమే ఉంది, అబూబకర్(ర) ఆందోళన చెందారు, అప్పుడు ప్రవక్త(స) "ఆందోళన చెందవద్దు, మనతో పాటు అల్లాహ్ ఉన్నాడు" అని అన్నారు. ఈ సందర్భంగా సురాఖా బిన్ జుషమ్ చేతిలో బళ్ళెం తీసుకొని గుర్రంపై వీరిని వెంబడిస్తూ వారిని సమీపిస్తాడు. అప్పుడు అబూబకర్(ర) "ఓ ప్రవక్తా! మనం పట్టుబడ్డాం" అని అంటారు. కాని ఆ సమయంలో ప్రవక్త(స) ఖుర్ఆన్ పఠిస్తూ ఎంతో ప్రశాంతంగా ఉంటారు.

మదీనా చేరిన తర్వాత యూదులు, కపటాకారులు, ఖురైష్ ప్రజల వైపు నుండి భయం ఉండేది. అనుచరులు ప్రవక్త(స) ఇంటి బయట కాపలా కాసేవారు. ఒకసారి **"అల్లాహ్ ప్రజల నుండి నిన్ను కాపాడుతాడు"** అనే వాక్యం అవతరించింది. వెంటనే బయటకు తొంగి చూచి కాపలా కాస్తున్నవారితో, "ప్రజలారా తిరిగి వెళ్ళిపోండి, నన్ను వదలివేయండి, నా రక్షణా బాధ్యతలు అల్లాహ్ తీసుకున్నాడు" అని అన్నారు.

నజ్ద్ యుద్ధం నుండి తిరుగు ప్రయాణంలో ప్రవక్త(స) ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకున్నారు. అనుచరులు అటూ ఇటూ కొంత దూరంలో ఉన్నారు. ఒక వ్యక్తి కరవాలం పట్టుకొని ముందుకు వచ్చాడు. ప్రవక్త(స) కూడా మేల్కొన్నారు. ఆ వ్యక్తి "ఓ ముహమ్మద్ ! నిన్ను నా నుండి ఎవరు రక్షిస్తారు!" అని అన్నాడు.

ప్రశాంతంగా, నిదానంగా “అల్లాహ్” అని అన్నారు. ఆ వ్యక్తి ప్రభావితుడై అతడి కరవాలం ఒర లోనికి వెళ్ళిపోయింది.

బద్ర్ సంగ్రామంలో 313మంది ముస్లిములు సాయుధులై 1000మంది అవిశ్వాసులను ఎదుర్కొన్నారు. 313మంది అనుచరుల నాయకుడు అల్లాహ్ సన్నిధిలో చేతులెత్తి ప్రార్ధిస్తున్నారు. అనేక విధాలుగా అల్లాహ్ ను ఇలా శరణు కోరుతున్నారు. “ఓ అల్లాహ్! ఈనాడు ఈ చిన్న సమూహం భూమి నుండి చెరిపి వేయబడితే, ఆ తరువాత నిన్ను ప్రార్ధించే వారెవరూ భూమిపై ఉండరు”.

ముస్లింల అడుగులు తడబడే సందర్భాలు కూడా వచ్చాయి. ముస్లిములు వెనక్కి తగ్గారు. కాని అల్లాహ్ సహాయంపై పరిపూర్ణ నమ్మకం కలిగి ఉన్న ముస్లిములు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా నిలబడ్డారు. ఉహుద్ లో చాలా మంది ముస్లింలు వెనక్కి తగ్గారు, కాని ప్రవక్త(స) తన స్థానంలో నిలకడగా ఉన్నారు. రాళ్ళు తిన్నారు, బాణాల, కరవాలాల, బళ్ళాల దాడులు జరుగు తున్నాయి. తలలో ఇనుప గొళుసు గుచ్చుకుంది, పళ్ళు విరిగాయి, ముఖానికి గాయాలయ్యాయి. అప్పుడు కూడా తన చేతిని కరవాలంపై పెట్టలేదు, ఎందుకంటే, ఆయన(స) అల్లాహ్ నే నమ్ముకున్నారు. అల్లాహ్ రక్షిస్తాడని, సహాయం చేస్తాడని ఆయనకు గట్టి నమ్మకం ఉండేది. హునైన్ యుద్ధంలో ఒకసారి పదివేల బాణాల వర్షం కురిసినపుడు కొంతసేపటి వరకు ముస్లిములు వెనక్కి తగ్గారు. కాని ప్రవక్త(స) తన స్థానంలోనే ఉన్నారు. ఇటు నుండి బాణాల వర్షం కురుస్తుంది, అటు “నేను ప్రవక్తను, అసత్యం పలుకను, నేను అబ్దుల్ ముత్తలిబ్ కుమారున్ని” అని నినాదం చేస్తున్నారు. వాహనం పై నుండి క్రిందికి దిగారు. నేను దైవదాసున్ని, ప్రవక్తను అని అన్న తరువాత చేతులు పైకి ఎత్తి దుఆ చేసారు.

**మిత్రులారా!** మీరు ఇంతటి వీరుడైన ఏకాగ్రత గల, నిలకడ గల, సైన్యం ఎంత చిన్నదైనా, ఆయుధాలు లేకపోయినా, తన సైన్యం అతన్ని వదలి కొంత దూరం

https://teluguislam.net

వెనక్కి తగ్గినా, తనను తాను కాపాడుకోవడం కోసం పారిపోని తనను రక్షించు కోవటానికి కరవాలం ఎత్తని సైన్యాధిపతిని ఎక్కడైనా చూసారా? అటువంటి కష్టసమయంలో కూడా భూశక్తులకు భయపడకుండా ఆకాశ శక్తులు కావాలని కోరు తున్నాడు. ఈ విషయంలో ఆయన ఆచరణా పథం ఇలా ఉండేది.

శత్రువులను కూడా ప్రేమించే కథలను వినే ఉంటారు. కాని దాని ఉదాహరణగాని, ఉపమానంగాని చూసి ఉండరు. రండి మదీనా మనిషిలో మీకు ఇవన్నీ చూపిస్తాను. మక్కా పరిస్థితులను వదలి వేస్తున్నాను, ఎందుకంటే అక్కడ మానవత్వమే ఉండేదికాదు. వలస పోయినపుడు ఖురైషుల నాయకులు, ముహమ్మద్(స) తల నరికి తెచ్చిన వారికి 100 ఒంటెలు బహుమానంగా ఇవ్వటం జరుగుతుంది అని ప్రకటించారు. సురాఖా బిన్ జుషుమ్ ఈ బహుమానం పొందే ఉద్దేశంతో ఆయుధాలు ధరించి ప్రవక్త(స)ను వెంబడించాడు. దగ్గరకు చేరుకుంటాడు, అబూబకర్(ర) ఆందోళనకు గురవుతారు. ప్రవక్త (స) అల్లాహ్ ను ప్రార్ధిస్తారు, మూడుసార్లు వాడి గుర్రం కాళ్ళు భూమిలో దిగబడి పోతాయి. సురాఖా బాణాలు తీసి లాటరీ వేస్తాడు. ప్రతిసారి వారిని వెంబడించకు అనే సమాధానం వస్తుంది. చివరికి అతను భయపడతాడు. తిరిగి వెళ్ళిపోదామని నిశ్చయించుకుంటాడు. ప్రవక్త(స) అతడిని పిలుస్తాడు. ప్రవక్త(స)కు ఖురైషులపై అల్లాహ్(త) ఆధిక్యత ప్రసాదించినపుడు నన్ను విచారించకూడదని శరణుపత్రం వ్రాయించి తీసుకుంటాడు. మక్కా విజయం తర్వాత అతడు ఇస్లామ్ స్వీకరిస్తాడు. కాని ఆనాటి సంఘటన గురించి ఏమాత్రం విచారించరు.

అబూసుఫియాన్ ఎవరో మీకు తెలుసా? ఇతడే బద్ర్, ఉహుద్, కందకం మొదలైన యుద్ధాలలో ప్రధానపాత్ర వహించాడు. అనేకమంది ముస్లిములను హతమార్చాడు. అనేకసార్లు ప్రవక్త(స)ను చంపటానికి ప్రయత్నించాడు. అడుగడుగునా ఇస్లామ్ మార్గంలో అవరోధాలు కల్పిస్తూ బద్ధశత్రువులా తయారయ్యాడు. కాని మక్కా విజయానికి ముందు అబ్బాస్(ర) వెంట ప్రవక్త(స)

https://teluguislam.net

ముందుకు వచ్చాడు. అప్పుడు అతడి ప్రతి నేరం అతన్ని చంపమని సలహా ఇచ్చింది, కాని ప్రవక్త(స) యొక్క క్షమాగుణం అబూసుఫియాన్ తో ఇలా అంటుంది, "భయపడకు, ముహమ్మద్(స) ప్రతీకారం తీర్చుకోరు. ఆ తరువాత ప్రవక్త(స) అతన్ని క్షమిస్తారు. అంతేకాదు, అబూసుఫియాన్ ఇంట్లో దాక్కున్న వారికి కూడా అభయం ఇవ్వబడుతుంది" అని అన్నారు.

హింద ఎవరో తెలుసా? ఈమె అబూసుఫియాన్ భార్య, ఉహుద్ యుద్ధంలో తన చెలికత్తెలతో కలసి ఆడుతూ పాడుతూ ఖురైషీ సైనికులను ఉత్తేజపరిచేది. ప్రవక్త(స)కు అందరికంటే ప్రియమైన చిన్నాన్నను, ఇస్లామ్ హీరో అయిన హమ్జా శవం పట్ల నీచంగా, అగౌరవంగా ప్రవర్తించింది. ఆయన గుండెను చీల్చింది, ముక్కు, చెవులను కోసి మెడలో వేసుకుంది. గుండెకాయ తీసి నమిలే ప్రయత్నం చేసింది. యుద్ధం తరువాత ఆ దృశ్యాన్ని చూచి ప్రవక్త(స) చాలా ఆందోళనకు గురయ్యారు. మక్కా విజయంనాడు ముసుగు ధరించి ఆ స్త్రీ ముందుకు వస్తుంది. అక్కడ కూడా ఊరుకోలేదు. కాని ప్రవక్త(స) ఏ విధమైన అభ్యంతరాన్నీ వెలుబుచ్చలేదు. నీవలా ఎందుకు చేసావని కూడా అడగలేదు. ఈ క్షమాగుణానికి ఆమె ప్రభావితురాలై బిగ్గరగా "ఓ ముహమ్మద్ ఇంతకు ముందు నీ వంటే అందరి కన్నా అసహ్యం అనిపించేది, కాని ఈనాడు అందరి కంటే అధికంగా నిన్ను నేను ప్రేమిస్తున్నాను" అని పలికింది.

హమ్జా హంతకుడు వహ్షీ తాయిఫ్ విజయం తరువాత అక్కడి నుండి పారిపోతాడు, అతడున్న ప్రదేశం కూడా జయించ బడుతుంది. అతడికి తలదాచుకునే చోటు మరెక్కడా లభించదు. అప్పుడు ప్రజలు "వహ్షీ! నీకు ఇంకా ముహమ్మద్ సంగతి తెలియదు, నీకోసం ముహమ్మద్(స) ప్రదేశం కంటే ప్రశాంత మయిన ప్రదేశం మరెక్కడా లేదు" అని అన్నారు. వహ్షీ ముహమ్మద్(స) వద్దకు వెళతాడు. ప్రవక్త(స) అతన్ని చూస్తారు, దృష్టి క్రిందికి వాల్చుకుంటారు. ప్రియచిన్నాన్న మరణదృశ్యం కళ్ళ ముందు కనబడుతుంది. కళ్ళు ఆశ్రువులతో

https://teluguislam.net

నిండిపోతాయి, హంతకుడు కూడా ముందు ఉన్నాడు. కాని “వహ్షీ వెళ్ళు నా ముందుకు రాకు, చిన్నాన్న మరణ దృశ్యం గుర్తుకొస్తుంది” అని మాత్రమే అన్నారు.

ఇస్లామ్, ముస్లిములకు, ప్రవక్త(స)కు బద్ధ శత్రువు ఇక్రమ, అబూజహల్ కుమారుడు. ఇతడు ప్రవక్త (స)ను అందరికంటే అధికంగా హింసించాడు. బాధలకు గురిచేసాడు. ఇస్లామ్ కు వ్యతిరేకంగా యుద్ధాలు కూడా చేసాడు. మక్కా విజయం నాడు అతనికి తన, తన కుటుంబంవారి నేరాలన్నీ గుర్తు న్నాయి. అతను పారిపోయి యమన్ వెళ్ళిపోయాడు. ఆయన భార్య ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త (స)ను గుర్తు పట్టింది. స్వయంగా ఆమె యమన్ వెళ్ళింది. ఆయన్ను ఓదార్చింది. ఆయన్ను తీసుకొని మదీనా వచ్చింది. ఈ విషయం ప్రవక్త(స)కు తెలిసిన వెంటనే ఆయన్ను ఆహ్వానించడానికి ఎంత తొందరగా లేస్తారంటే ఆయన ఒంటిపై దుప్పటి కూడా ఉండదు. సంతోషం పట్టలేక “ముహాజిర్ ప్రయాణికుడా! నీ రాక నీకు శుభమగుగాక” అని అంటారు, ఆలోచించండి! స్వాగతం ఎవరికి పలకబడుతుంది? ఎవరి రాకవల్ల సంతోషం కలుగుతుంది? ఎవరిని క్షమించడం జరుగుతుంది? అతని తండ్రి మక్కాలో ప్రవక్త(స)ను అనేక విధాలుగా హింసించాడు. శరీరంపై మాలిన్యాన్ని వేసాడు. నమాజు స్థితిలో దాడి చేసాడు. మెడలో దుప్పటి వేసి లాగాడు. దారున్నద్వహ్ లో ప్రవక్త(స) హత్యకోసం కుట్ర పన్నాడు. బద్ర్ యుద్ధానికి కారకుడూ ఆయనే. ఒప్పందాలను భంగపరిచిందీ ఆయనే. ఈనాడు ఆయన రాకపట్ల ఇంత సంతోషం వ్యక్తం చేయటం సాధ్యమా?

హిబార్ బిన్ అల్ అస్వద్ ఒక విధంగా ప్రవక్త(స) కుమార్తె జైనబ్ హంతకుడు. అంతేకాదు ఎన్నో ఇస్లామ్ వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడ్డాడు. మక్కా విజయం వార్త విని అతని రక్తం ఉడికిపోతుంది. ఈరాన్ పారిపోదామని అనుకుంటాడు, కాని ఏదో ఆలోచించి ప్రవక్త(స) వద్దకు వెళతాడు. “ఓ ప్రవక్తా! నేను పారిపోయి ఈరాన్ వెళ్ళిపోదామని అనుకున్నాను. కాని నాకు ప్రవక్త క్షమాగుణం, దయ, జాలి గుర్తుకొచ్చాయి. వెంటనే నేను ఇక్కడికి వచ్చేసాను. నా నేరాల గురించి

అందిన వార్తలన్నీ నిజమైనవే" అని విన్నవించుకుంటాడు. అది విన్న వెంటనే ప్రవక్త(స) కారుణ్య ద్వారాలు తెరుచుకుంటాయి. శత్రువు స్నేహితుడు అనే తేడా మాయం అవుతుంది.

బద్ర్ యుద్ధం తరువాత ఉమైర్ బిన్ వహబ్ ఒక అవిశ్వాస ధనవంతుని కుట్రవల్ల తన ఖడ్గానికి విషం పూసి మదీనా వస్తాడు. అవకాశం దొరికితే ప్రవక్త(స) పని పూర్తి చేద్దామని వేచి ఉంటాడు. కాని పట్టు బడతాడు. ప్రవక్త(స) వద్దకు తీసుకువస్తారు, నేరం తేలిపోతుంది కాని అతన్ని విడుదల చేయడం జరుగుతుంది.

సఫ్వాన్ బిన్ ఉమయ్యహ్ ప్రవక్త(స)ను చంపమని ఉమైర్ ను పంపిన ధనవంతుడు. అంతేకాదు ఒకవేళ ఈ పనిలో ప్రాణాలు కోల్పోతే నీ భార్యాబిడ్డలకు, నీ అప్పుకు నేను బాధ్యుడిని అని వాగ్దానం చేసాడు. మక్కా విజయం తరువాత భయపడి సముద్ర మార్గాన యమన్ పారిపోదామని జిద్దా ఓడరేవుకు పారి పోతాడు. ఉమైర్ ప్రవక్త(స) వద్దకు వచ్చి "ఓ ప్రవక్తా! సఫ్వాన్ మా నాయకుడు భయపడి పారి పోయాడు" అని విన్నవించుకుంటాడు. దానికి ప్రవక్త(స) "అభయం ఇచ్చాను" అని అంటారు. అప్పుడు ఉమైర్ అభయం ఇచ్చినట్టు ఏదైనా సూచన ఇస్తే బాగుంటుందని విన్నవించుకుంటాడు. ప్రవక్త(స) తన పగిడి తీసి ఇస్తారు. ఉమైర్ అది తీసుకొని వాడి దగ్గరకు వెళతాడు. అప్పుడు సఫ్వాన్ నాకు ముహమ్మద్ దగ్గరకు వెళ్ళడంలో ప్రాణభయం ఉందని అంటాడు. దానికి ఉమైర్ "ఓ సఫ్వాన్! ఇంకా నీకు ముహమ్మద్(స) దయాగుణం, జాలి, క్షమాగుణం గురించి తెలియదా" అని అంటాడు. సఫ్వాన్ ప్రవక్త(స) సన్నిధిలో హాజరౌతాడు. "నాకు అభయం ఇచ్చారని విన్నాను, నిజమా" అని అంటాడు. "అవును" అని ప్రవక్త(స) అంటారు. "నేను మీ ధర్మాన్ని స్వీకరించను, నాకు రెండు నెలలు గడువు కావాలి" అని అన్నాడు. దానికి ప్రవక్త(స) "నీకు రెండు కాదు నాలుగు నెలలు గడువు

ఇవ్వబడుతుంది" అని అన్నారు. కాని ఆ ఇచ్చిన గడువు పూర్తి కాక ముందే ఇస్లామ్ స్వీకరించాడు.

ప్రవక్త(స) ఖైబర్ వెళతారు. అక్కడ యూదుల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. పోరాటాలు జరుగుతాయి. విజయం సాధిస్తారు. ఒక యూద స్త్రీ విందుకు ఆహ్వానిస్తుంది, ప్రవక్త(స) ఆమె విందును స్వీకరిస్తారు. ఆ యూద స్త్రీ మాంసంలో విషం కలుపుతుంది, ప్రవక్త(స) మాంసపు ముక్క నోట్లో పెట్టగానే ఆయనకు దాన్ని గురించి తెలుస్తుంది, యూద స్త్రీని పిలిచి అడగ్గా ఆమె తన తప్పు ఒప్పుకుంటుంది. కాని ఆమె ఎటువంటి శిక్షకు గురిచేయబడదు. అయితే ఆ విష ప్రభావం జీవితాంతం ఉంటుంది.

నజ్ద్ పోరాటం నుండి తిరుగు ప్రయాణంలో ప్రవక్త(స) ఒంటరిగా ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసు కుంటున్నారు, అది మధ్యాహ్న సమయం, ప్రవక్త(స) కరవాలం చెట్టుకు ప్రేలాడుతుంది, అనుచరులు అటూ ఇటూ పడుకొని ఉన్నారు. దగ్గరలో ఎవరూ లేరు. ఒక వ్యక్తి అవకాశం చూచి ప్రవక్త(స) వద్దకు వచ్చి, కరవాలాన్ని తీసుకొని ఒర నుండి బయటకు తీస్తాడు, ప్రవక్త(స) వెంటనే మేల్కొంటారు, ఆ వ్యక్తి కరవాలం త్రిప్పుతూ "ముహమ్మద్ ! ఇప్పుడు నా నుండి నిన్ను ఎవరు రక్షిస్తారు?" అని అంటాడు. ప్రవక్త(స) నిర్భయంగా, ప్రశాంతంగా "అల్లాహ్" అని అంటారు. ఆ సమాధానం విన్న వెంటనే భయపడి పోతాడు, కరవాలాన్ని ఒరలోనికి తీసుకుంటాడు. అనుచరులు చుట్టూ చేరుతారు. ఆ వ్యక్తి కూర్చుండి పోతాడు. ప్రవక్త(స) ఏమాత్రం విచారించరు.

ఒకసారి ఒక అవిశ్వాసిని తీసుకురావడం జరుగుతుంది. ప్రవక్తను చంపే ప్రయత్నంలో ఉన్నాడని అతనిపై ఆరోపణ. అతడు ప్రవక్త(స)ను చూచి భయపడతాడు. ప్రవక్త(స) అతన్ని ఓదార్చుతారు. ఆ తరువాత అతనితో "ఒకవేళ నువ్వు చంపాలనుకున్నా చంపలేవు" అని అన్నారు. మక్కా పోరాటంలో ఈ

వ్యక్తుల గుంపు బంధించబడింది. వీరు తన్ యీమ్ కొండ నుండి దిగి ప్రవక్త(స) ను చంపాలను కున్నారు. ప్రవక్త(స)కు ఈ విషయం తెలిసింది. వీరిని వదలి వేయండని ఆదేశించారు.

**సోదరులారా!** మీరు తాయిఫ్ కు వెళతారు, మక్కా కాలంలో ప్రవక్త(స)కు శరణు ఇవ్వనివారు వీరే, అసలు వీరు వినటానికే సిద్ధపడలేదు. ఇక్కడ ధనవంతుల కుటుంబాలు ప్రవక్త(స)ను ఎగతాళి చేసారు. ప్రవక్త పట్ల హాస్యంగా ప్రవర్తించమని ఇతరులను పురికొలిపారు. పట్టణంలోని అల్లరి మూకలన్నీ అన్ని వైపుల నుండి ప్రవక్త(స)పై రాళ్ళు రువ్వాయి. చివరికు కాళ్ళకు విపరీతంగా గాయాలయ్యాయి. రెండు కాళ్ళ చెప్పులు రక్తసిక్తం అయ్యాయి. ప్రవక్త(స) అలసిపోయి కూర్చుండి పోతే వీరు భుజాలు పట్టి లేపుతారు. నడవసాగితే మళ్ళీ రాళ్ళు రువ్వుతారు. ఈ రోజు ప్రవక్త(స)కు ఎంతో బాధ కలిగింది, 9సంవత్సరాల తర్వాత ఆయిషహ్(ర) ప్రవక్త(స)ను "అన్నిటి కంటే కఠిన దినం?" ఏది అని ప్రశ్నించగా "తాయిఫ్ దినం" అని సమాధానం ఇచ్చారు. 8హిజ్రీలో ముస్లిమ్ సైన్యాలు ఈ తాయిఫ్ నే చుటుముట్టాయి. కొంతకాలం వరకు ముట్టడి కొనసాగింది. అనేకమంది ముస్లింలు చంపబడ్డారు. తిరిగి పోదామని ప్రవక్త(స) నిర్ణయించుకుంటారు. కాని ముస్లింలు సిద్ధపడరు, తాయిఫ్ ప్రజలను శపించమని విన్నవించుకుంటారు. ప్రవక్త(స) చేతులు ఎత్తుతారు. కాని ఏమని ప్రార్థిస్తారో చూడండి, "ఓ అల్లాహ్! తాయిఫ్ ప్రజలకు రుజుమార్గాన్ని ప్రసాదించు, వారిని ఇస్లామ్ లోనికి ప్రవేశింపజేయి". సోదరులారా! ఎవరి గురించి ఇలా ప్రార్థించారు, ప్రవక్త(స) పై రాళ్ళు రువ్వి గాయపరచిన, శరణు ఇవ్వనివారి గురించి.

ఉహుద్ పోరాటంలో శత్రువులు దాడి చేస్తారు. ముస్లిముల పాదాలు తడబడతాయి. ప్రవక్త(స) శత్రువుల కక్ష్యలో ఉంటారు. ప్రవక్త(స)పై రాళ్ళు, బాణాలు, కరవాలాలు విరుచుకు పడుతున్నాయి. ప్రవక్త(స) పళ్ళు విరిగాయి. తన రక్షణా సాధనాలే తన తలకు గుచ్చుకుంటాయి. ముఖమంతా రక్తసిక్తమౌతుంది. ఈ

https://teluguislam.net

పరిస్థితిలో కూడా ఆయన నోటి నుండి ఈ పదాలే వస్తున్నాయి. "తమ ప్రవక్తనే చంపే ప్రయత్నం చేస్తున్న ఆ జాతి ఎలా సాఫల్యం పొందుతుంది. ఓ అల్లాహ్! నా జాతికి మార్గదర్శ కత్వాన్ని ప్రసాదించు, దానికి ఏమీ తెలియదు. నీ శత్రువును ప్రేమించు" అనే ఈసా(అ) ఆచరణ కేవలం కవిత్వం కాదు కఠినమైన ఆచరణా పధం.

వహీ బిన్ ఈద్యాలీల్ కుటుంబం తాయిఫ్ లో ప్రవక్త(స)ను అనేక విధాలుగా హింసిస్తారు, ఇతడే ఒక బృందాన్ని తీసుకొని మదీనా విచ్చేసినపుడు తన పవిత్ర మస్జిద్ లో టెంట్ వేసి విడిది ఏర్పాటు చేస్తారు. ప్రతిరోజు ఇషా నమాజు తర్వాత అతన్ని కలవటానికి వెళ్ళి వ్యధాభరితమైన మక్కా జీవితాన్ని గురించి చెప్పేవారు. ఎవరిని? తనపై రాళ్ళు విసిరిన వారిని, అవమాన పరిచిన వారిని, ఇదీ నీ శత్రువును ప్రేమించు, క్షమించు అంటే అర్ధం.

మక్కా విజయం తర్వాత హరమ్ ప్రాంగణంలో, ఏ ప్రాంగణంలో, ఎక్కడైతే తనకు తిట్టటం జరిగిందో, ఎక్కడైతే చెత్తా చెదారం వేయబడిందో, ఎక్కడైతే తనను చంపటానికి కుట్ర పన్నడం జరిగిందో, అక్కడ మక్కా నాయకులందరూ నిలబడి ఉన్నారు. వారిలో ఇస్లామ్ కు వ్యతిరేకంగా శక్తివంచన లేకుండా ప్రయత్నించినవారూ ఉన్నారు, ప్రవక్త(స)ను తిరస్కరించినవారూ ఉన్నారు, తనను తిట్టినవారూ ఉన్నారు, తన మార్గంలో ముళ్ళు పరిచేవారూ ఉన్నారు, అన్యాయంగా బంధువులను హతమార్చిన వారూ ఉన్నారు, పేదలను హింసించినవారూ ఉన్నారు, ఈనాడు ఈ నేరస్తులందరూ తలలు దించు కొని నిలబడి ఉన్నారు, అనుచరుల కరవాలాలు ప్రవక్త(స) ఆదేశానికి, ఆజ్ఞ పూర్తయ్యే లోపలే తలలు నరకడానికి వేచి ఉన్నాయి. అకస్మాత్తుగా ప్రవక్త(స) నోరు కదులుతుంది, "ఖురైష్ ప్రజలారా! మీరే చెప్పండి, ఈనాడు మీ పట్ల ఎలా ప్రవర్తించాలి?" సమాధానం వస్తుంది, "ముహమ్మద్ నీవు మా మంచి సోదరుడవు, మంచి అన్న కొడుకువు". అప్పుడు ప్రవక్త(స) ఇలా అంటున్నారు, "యూసుఫ్(అ) హింసలకు పాల్పడిన తన

https://teluguislam.net

సోదరులతో చెప్పిన విధంగా నేనూ ఈనాడు మీతో చెబుతున్నాను, ఈనాడు మీపై ఎలాంటి ఆరోపణ లేదు, వెళ్ళండి మీరందరూ స్వతంత్రులు".

శత్రువులను ప్రేమించడమంటే, క్షమించడమంటే ఇదే. ఇస్లామ్ ప్రవక్త యొక్క ఆచరణా పథం, అభ్యాస శిక్షణ. ఇది కేవలం తియ్యటి మాటల వరకే, ఉత్సాహ భరితమైన ప్రసంగాల వరకే పరిమితం కాదు, ప్రపంచంలో సంఘటనగా ఆచరణగా ఉద్భవించింది.

ఇతర ధర్మాలవారు తమ ప్రవక్తల వ్యవస్థాపకుల సుమధుర, మనోహర పదాలవైపు పిలుస్తూ ఉంటారు. మాటిమాటికీ వాటిని వల్లిస్తూ ఉంటారు. ఎందుకంటే అవి తప్ప వారివద్ద మరేమీ లేదు. కాని ఇస్లామ్ తన ప్రవక్త యొక్క పదాల గురించే కాదు, ఆచరణ, సాంప్రదాయాల గురించి కూడా సందేశం ఇస్తుంది. ముహమ్మద్(స) ఈ లోకం నుండి పరమ పదించి నపుడు ఇలా ఉపదేశించారు,

تَرَكْتُ فِيكُمْ الثَّقَلَيْنِ كِتَابَ اللهِ وَ سُنَّتِي.(مسلم)

**నేను మీ మధ్య రెండు ప్రధాన విషయాలను వదలి వెళ్తున్నాను, దైవగ్రంథం, నా ఆచరణా పథం.(ముస్లిమ్)**

ఈ రెండు ప్రధాన విషయాలు ఇప్పటి వరకు స్థిరంగా ఉన్నాయి. ఇన్షాఅల్లాహ్ తీర్పుదినం వరకు స్థిరంగా ఉంటాయి. అందువల్లే ఇస్లామ్ దైవ గ్రంథంతో పాటు తన ప్రవక్త సాంప్రదాయానికి కూడా విధేయత చూపమని ఆదేశిస్తుంది.

لَقَدْ كَانَ لَكُمْ فِي رَسُولُ اللهِ أُسْوَةٌ حَسَنَةٌ .( الأحزاب-٢١)

**మీకోసం అల్లాహ్ ప్రవక్త జీవితంలో అత్యుత్తమమైన ఆదర్శం ఉంది.(అల్అహ్జాబ్-21)**

స్వయంగా ఇస్లామ్ తన ప్రవక్తను దైవగ్రంథ ఆచరణా రూపంగా, ఆదర్శంగా, మోడల్ గా ప్రదర్శిస్తుంది. ప్రపంచంలో ఈ గౌరవం కేవలం ఇస్లామ్ ప్రవక్తకే ఉంది. ఎందుకంటే ఆయన విద్యాభ్యాసంతో పాటు ఆచరణా విధానాన్ని కూడా ముందుంచుతుంది. నమాజ్ పద్ధతి తెలియని వారికి "నన్ను నమాజ్ చేస్తూ ఉండగా చూసినట్టు మీరూ నమజ్ ఆచరించండి" అని బోధించారు. భార్యాబిడ్డల పట్ల మంచిగా వ్యవహరించాలని ఈ విధంగా బోధిస్తారు, "భార్యాబిడ్డల పట్ల మంచిగా వ్యవహరించిన వారే మీలో అందరి కన్నా ఉత్తములు. నేను నా భార్యాబిడ్డల కొరకు మీ అందరికంటే మంచివాడను". చివరి హజ్ సందర్భం, అంతిమ ప్రవక్త చుట్టూ లక్షకు పైగా అనుచరులు. మానవులకు దైవం తరపున చివరి సందేశం ఇలా అంద జేయబడుతుంది. "అరబ్ లోని మూఢనమ్మకాలు, మూఢాచారాలు, అంతం కాని పోరాటాల పరంపరను ఈనాడు రద్దు చేయడం జరిగింది. విద్యాజ్ఞానాలతో పాటు తన ఆచరణా విధానాన్ని చూపెట్టటం జరిగింది.

ఈనాడు అరబ్ లోని ప్రతీకార రక్తపాతం అంతా రద్దు చేయడం జరిగింది. అంటే మీరందరూ పరస్పర హంతకులను క్షమించండి. అందరికంటే ముందు నేను నా కుటుంబానికి చెందిన రబీఅ బిన్ హారిస్ కుమారుని హత్యను క్షమిస్తున్నాను. అజ్ఞానకాలం నాటి వడ్డీ లావాదేవీలన్నిటినీ ఈనాడు నేను రద్దు చేస్తున్నాను. అన్నిటికంటే ముందు నేను మా చిన్నాన్న అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వడ్డీ వ్యాపారాన్ని రద్దు చేస్తున్నాను".

ధనప్రాణాల తర్వాత మూఢాచారాలను పాటించేవారు కూడా ప్రజల మానమర్యాదలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరిస్తారు. ఇటువంటి వాటిని రద్దు చేసే ధైర్యం చూపితే తమ్ముతాము రద్దు చేసుకో వలసి వస్తుంది. ఎంత ప్రజానాయకులైనా సమాజంలో ఉన్న మూఢాచారాలను సంస్కరించే ధైర్యం చాలా తక్కువ మంది చేస్తారు.

ముహమ్మద్(స) ప్రజలకు సమానత్వం గురించి బోధించారు. అరబ్ లో అందరికంటే నీచులుగా బానిసలు భావించబడేవారు. ప్రవక్త(స) సమానత్వం, సోదరభావం మొదలైన భావాలను ఆచరించి చూపారు. ఒక బానిసను దత్తపుత్రునిగా చేసుకున్నారు. అరబ్ వర్గాల్లో పరస్పర మంచితనంలోని హెచ్చుతగ్గులను కూడా దృష్టిలో పెట్టుకోవటం జరిగేది. యుద్ధాల్లో కూడా తనకన్నా తక్కువ స్థాయికి చెందిన వ్యక్తిపై కరవాలం ఎత్తడం కూడా అవమానంగా భావించేవారు, నీచరక్తం నా కరవాలానికి అంట కూడదని. కాని ప్రవక్త(స) ఇలా ప్రకటించినపుడు, "ప్రజలారా! మీరంతా ఆదమ్ కుమారులు, ఆదమ్ మట్టి ద్వారా సృష్టించబడ్డారు. నల్లవారికి తెల్లవారిపై, తెల్లవారికి నల్లవారిపై, అరబీకి అజమీపై, అజమీకి అరబీపై ఎటువంటి ప్రాధాన్యత లేదు. మీలో అందరికంటే అధికంగా దైవభీతి గలవారే మీలో అందరికంటే ఉత్తములు". ఈ బోధనలు అకస్మాత్తుగా అందరినీ సమానంగా చేసివేసాయి. అయితే ఉపమానాల కొరత ఉండేది. ఆ ఉపమానాలను కూడా ఆయనే ఆచరించి చూపారు. ఆ బానిసను తన అత్తకూతురికిచ్చి వివాహం చేసారు. దత్తపుత్రుని నుండి విడాకులు పొందిన స్త్రీతో వివాహం అరబ్ లో నిషిద్ధంగా ఉండేది. అంతేకాదు కేవలం పదాల సంబంధం ఉండేది. దీనికి ఆచరణలతో ఎటువంటి సంబంధం ఉండేదికాదు. దీనివల్ల కుటుంబాల్లో చెడులు వ్యాపించి ఉండేవి. వాటిని అరికట్టడం తప్పని సరి అయ్యింది. కాని వాటిని అరికట్టేందుకు ఆచరణ కావాలి. ఇది మానవుని ఆత్మాభిమానంతో సంబంధం కలిగి ఉంది. ఇది చాలా కష్టమైన పని, ప్రవక్త(స) అడుగు ముందుకు వేసి దాన్ని ఆచరించి చూపారు. జైద్ బిన్ హారిసా నుండి విడాకులు పొందిన జైనబ్ ను వివాహం చేసుకున్నారు. ఆనాటి నుండి ఈ మూఢాచారం అరబ్ నుండి అదృశ్యమయిపోయింది. సంఘటనల కొరత లేదు. ఉపమానాల కొదువ లేదు. కాని సమయం చాలా తక్కువగా ఉంది. ఈనాడు నేను చాలా సమయం తీసుకున్నా నినుకుంటాను.

https://teluguislam.net

**సోదరులారా!** నేను చెప్పిన విషయాల వెలుగులో ఆదమ్ నుండి ఈసా వరకు, సిరియా నుండి ఇండియా వరకు ఉన్న సంస్కర్తల జీవిత చరిత్రల్లో ఇటువంటి ఆదేశాల, ఆచరణల ఉపమానాలు ఎక్కడైనా కనిపిస్తాయా? వెతకండి.

**సభికులారా!** మధురమైన, మనోహరమైన పలుకులు పలికే బోధకులు, కవులు తమ సభల్లో దైవ ప్రేమను గురించి పేర్కొనడం, అనవసరమైన ప్రగల్భాలు పలకడం, వినిపించడం చేస్తారు. వీరి నానుడి ఆధారంగానే చెట్టు తన పళ్ళ ద్వారా గుర్తించబడుతుంది. వీరి జీవితాల్లో దైవ ప్రేమ ప్రభావం ఉండేదా? అరబ్బుల దైవప్రేమకు సంబంధించిన చరిత్రలు చదవండి. రాత్రులు గడుస్తాయి. ప్రపంచమంతా నిద్రపోతుంది, అతని కళ్ళు జాగరణ చేస్తున్నాయి, చేతులు దైవం ముందు చాచి ఉన్నాయి. నోరు దైవాన్ని కీర్తిస్తుంది. హృదయం విలవిలలాడుతుంది. కళ్ళంట అశ్రువులు కారుతున్నాయి. దైవ ప్రేమకు నిదర్శనం ఇదా లేక అదా? .

ఈసా(అ) శిలువ పై ఎక్కించబడినపుడు "ఓ దేవా! ఓ దేవా! నీవు నన్ను ఎందుకు విడిచి పోయావు?" అని అన్నారు. కాని ముహమ్మద్(స) మరణావస్థలో ఉన్నప్పుడు చివరి శ్వాస పీల్చుకుంటూ "ఓ నా ప్రభూ! నా ఉత్తమ మిత్రుడా" అని అన్నారు. ఈ రెంటిలో దేనిలో దైవప్రేమ కనబడుతుంది.

★ ★ ★ ★ ★